డీ లిమిటేషన్‌ను అంగీకరించొద్దు

- ప్రస్తుతం ఉన్న సీట్లలోనే పునర్విభజన
- జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజనకు మేం వ్యతిరేకం
- ప్రొరేటా ప్రక్రియ రాజకీయ అంతరాలను పెంచుతుంది
- దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలి
- చెన్నైలో డిఎంకె నిర్వహించిన సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

దక్షిణాది రాష్ట్రాల సదస్సుకు హాజరైన ముఖ్య మంత్రులు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజనలో బిజెపిది జనాభా జరిమానా విధానమని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మనందరిది ఒకే దేశమనీ, దాన్ని గౌరవిద్దామనీ, అయితే పునర్విభజనను అంగీకరించొద్దని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనపై శనివారం చెన్నైలో జరిగిన సదస్సులో రేవంత్ రెడ్డి మాట్లాడారు. సీట్లు పెంచకుండా ఉన్న సీట్లలోనే పునర్విభజన చేయాలని కోరారు. జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజనకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రొరేటా ప్రక్రియ రాజకీయ అంతరాలను పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నింటిపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజనపై అందరిని ఏకతాటిపైకి తెచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

1971లో జనాభాను నియంత్రించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేస్తే ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి.. జిడిపి, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయని చెప్పారు. దేశ ఖజానాకు మనం పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నాయన్నారు. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తుంటే... ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి రూ.2.73, బీహార్‌కు రూ.9.22, మధ్యప్రదేశ్‌కు రూ.2.79 వెనక్కి వెళ్తున్నాయని తెలిపారు. అదే దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటకకు 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు వెనక్కి వస్తున్నాయని వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయని విమర్శించారు.

దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపుకు దారితీసే పునర్విభజనను అంగీకరించబోమని తేల్చిచెప్పారు. ప్రగతిని సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తోందనీ, ఇలాంటి అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1976లో రాజకీయ తేడాలు రాకుండా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పునర్విభజన చేపట్టిందని గుర్తుచేశారు. 2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించిందని తెలిపారు. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ గళం కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది వారిని ఉత్తరాది ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించి వేస్తుందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చలాయిస్తాయన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, పార్టీలు, నాయకులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రొరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది.. ఒక్క సీటు కూడా తేడాను చూపుతుందన్నారు. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన దేశంలో ఉందని గుర్తుచేశారు. కాబట్టి ప్రొరేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి విధానాన్ని పాటించి, మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో ఎటువంటి మార్పు తీసుకురావద్దని కోరారు.

శాసనసభలో తీర్మానం

పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేస్తున్నట్టే దక్షిణాది రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానాలు చేయాలని సహచర ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా, ఐక్యంగా మొత్తం భారతదేశానికి వినిపిద్దామని సూచించారు.

హైదరాబాద్‌లో సమావేశం

పునర్విభజన ప్రక్రియపై తర్వాత సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోరాటాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళదామనే విషయాన్ని ఆ సమావేశంలో చర్చిద్దామన్నారు. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ఒక భారీ బహిరంగ సభను తాను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దక్షిణ భారతదేశానికి చెందిన వారందరూ కలిసి రావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

అవార్డు అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

డాక్టర్ సుబ్రహ్మణ్యంకు 'సర్వీసు అబోవ్ సెల్ఫ్' అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్

పాలియేటివ్ కేర్ రంగంలో అవిశ్రాంత కృషికి గుర్తింపుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యంకు రోటరీ ఇంటర్నేషనల్ అత్యున్నత 'సర్వీస్ అబోవ్ సెల్ఫ్ అవార్డు'ను ప్రదానం చేసింది. దీనిని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోటరీ క్లబ్ వారు అందజేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పురస్కారాన్ని 150 వ్యక్తులకు మాత్రమే ఇవ్వబడిందని నిర్వాహకులు తెలిపారు. దీన్ని వ్యక్తిగత రోటేరియన్లు అత్యున్నత గౌరవంగా భావిస్తారు. రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌తో అనుబంధించబడిన అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక పాలియేటివ్ కేర్ సెంటర్ అయిన స్పార్ష్ హాస్పిస్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు.

కార్యకర్తలతో సమావేశమైన కెసిఆర్

బిఆర్ఎస్ సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకొస్తుంది : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న రోజుల్లో బిఆర్ఎస్ సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తుందని బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో పెద్దపల్లి జిల్లా నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెల్లం ఉన్న దగ్గర ఈగలు వస్తాయని, బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణలో ఇబ్బందులు లేవని తెలిపారు. సిరిసంపదలు ఉన్న తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రం ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుందని చెప్పారు. ఆనాడు మోడీ తన మెడపై కత్తి పెట్టినా తెలంగాణ కోసం ఎక్కడా వెనుకడుగు వేయలేదని తెలిపారు. రామగుండంలో గెలిచిన ఎమ్మెల్యే ఓ సన్నాసి అని, ఎపిలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవారు కాదని అన్నారు. ఆనాడు బలవంతంగా తెలంగాణను ఆంధ్రాలో కలిపారన్నారు. నేలపై ఎవరూ శాశ్వతం కాదని, అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని సూచించారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడాలని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టకున్నా రైతుబంధు, కల్యాణ లక్ష్మీ ఇచ్చిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతోందన్నారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బిఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అడిషనల్ డిసిపి మృతి

- రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన ఎపిఎస్ ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాకింగ్‌కు వెళ్లిన అడిషనల్ డిసిపి రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోయారు. ఆ ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మారెడ్డిపాలెంలోని మైత్రి కుటీర్‌లో నివాసముంటున్న అడిషనల్ డిసిపి గొ.ఎం.నందీశ్వర బాబ్జి(50) రోజూ మాదిరిగానే శనివారం వేకువజామున మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హనుమాన్ దేవాలయం నుంచి రోడ్డు దాటుతుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వస్తున్న నూజివీడు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు (ఏపీ 39వీఏ 9563) అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో అతని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన బాబ్జి స్వస్థలం ఆంధ్రప్రదేశ్. రాచకొండ కమిషరేట్‌లోని కంట్రోల్ రూమ్, షీ టీం ఏసీపీగా పనిచేశారు. మూడ్రోజుల కిందట అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన ఇంకా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంది.

కౌలు రైతులకూ 'రైతు భరోసా' వర్తింపజేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కౌలు రైతులకు రైతు భరోసా, రైతు భీమా వర్తింపజేయాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీలో వ్యయసాయం, ఆరోగ్యం. రవాణా పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ... రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులున్నారనీ, వారందరికి పట్టాదారు రైతుల మాదిరిగానే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయానికి కేటాయింపులను మరో రూ.5వేల కోట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌళిక సదుపాయాలను పెంచాలని కోరారు. వైద్య సిబ్బంది, సౌకర్యాల లేమి వల్ల నా నియోజవర్గమైన కొత్తగూడెంలోని మాతా శిశు కేంద్రంలో ఇటీవల ఇద్దరు మహిళలు మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా దవాఖానలను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు అందించడంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీలో నవజాత శిశువు మృతదేహం

- మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రెయినేజీలో నవజాత శిశువు మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ ఏరియాలోని మెడికవర్ ఉమెన్స్ అండ్ చైల్డ్ హాస్పిటల్ పక్కన గల బస్టాప్ ఎదుట ఉన్న డ్రెయినేజీ వద్ద నవజాత శిశువు మృతదేహం కనిపించింది. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది ఒకరు నమాజ్ కోసం వెళుతుండగా గుర్తించి, తన ఆస్పత్రి డ్యూటీ డాక్టర్‌కు విషయం చెప్పాడు. డ్యూటీ డాక్టర్ ఘటనా స్థలానికి వెళ్లి ఆ మగ శిశువును పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. వెంటనే మాదాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వర్షానికి డ్రెయినేజీ నీటిలో శిశువు కొట్టుకొచ్చి ఆస్పత్రి బస్టాప్ ఎదుట చెత్తలో తట్టి ఆగినట్టు భావిస్తున్నారు. శిశువు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థిని మృతి

- పరీక్ష రాసి వస్తుండగా ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెన్త్ పరీక్ష రాసి ఇంటికి బయలుదేరిన విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోయింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీకి చెందిన ప్రభాతి ఛత్రియ (16) టెలికాంనగర్‌లో 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. శుక్రవారం మొదటి పరీక్ష రాసిన ఆమె రెండో రోజు శనివారం తన అన్న సుమన్ బైక్‌పై పరీక్షకు వెళ్లింది. పరీక్ష పూర్తి అయిన అనంతరం తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గచ్చిబౌలి ఫ్లై ఓవర్ వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి.. ఆర్‌టిసి డబుల్ డెక్కర్ బస్సు చక్రాల కింద పడింది. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న ప్రభాతి ఛత్రియ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె అన్న సుమన్ ఛత్రియకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థిని మృతితో టీఎన్జీవో కాలనీలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత అరిగోస !

- ఎండుతున్న పంటలు, ఆందోళనలో రైతులు
- కుంటల్లో, చెరువుల్లో నీరు లేక రైతు తంటాలు
- ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మండుతున్న ఎండలకు మార్చి నెలలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కుంటలు, చెరువుల్లో నీళ్లు లేవు. తలాపునే రిజర్వాయర్ ఉన్నా.. సాగునీరు రాక కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే అన్నదాత తల్లడిల్లుతున్నాడు. దేవాదుల ద్వారా పాలకులు సాగునీరు అందించినట్లయితే పంటలు పండుతాయని, లేదంటే పెట్టిన పెట్టుబడి నష్టపోయి, అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం, రంగరాయి గూడెం, సముద్రాల, పాలకుర్తి మండలం గూడూరు పరిధిలో చెరువులు, కుంటలు అడుగంటిపోయాయి. బోర్లలో, వ్యవసాయ బావుల్లో నీళ్లు లేక పంట చేలు ఎండిపోతున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్-నవాబ్‌పేట ఆర్ఎస్ ప్రధాన కాలువ ద్వారా నీరు తలాపునుంచే తరలుతున్నా, అనుసంధానంగా ఉన్న 3 ఎల్ కెనాల్‌లో నీరు రావడం లేదని రైతులు చెబుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రధాన కాలువ అనుసంధానంగా ఉన్న సబ్ కాలువలకు నీటిని విడుదల చేయడంతో సాగునీటిపై ఆధారపడిన రైతులు సుమారు 1000 ఎకరాలకు వరి, మొక్కజొన్న సాగు చేశారు. నీటిని వినియోగించుకుంటూ పంటచేలను తడుపుకుంటున్నారు. 3 ఎల్ కాలవకు రావాల్సిన నీరు.. సుమారు నెల రోజులకుపైగా రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. కెనాల్ వెంట సాగు చేసిన పంటచేలు ఎండిపోతుండటంతో లక్షల్లో అప్పు తెచ్చి పంటసాగు చేసిన తమ పరిస్థితి ఏంటని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. 3 ఎల్ కాలువ ద్వారా సాగునీరు వచ్చినట్లయితే తద్వారా దిగువనున్న పెద్దకుంట, బండకుంట, సత్రోని కుంట, రాయికుంట, బ్రాహ్మణ కుంట, తీగల చెరువు, గూడూరు చెరువు, మరో ఇతర రెండు కుంటల్లో సాగునీరు నింపితే వందలాది రైతుల సమస్య తీరుతుందని అంటున్నారు.

మొక్కజొన్న రైతుకూ అడియాశలే...

నెల క్రితం 15 రోజులపాటు కెనాల్ ద్వారా నీరు రావడంతో అప్పటికే ఉన్న పనికిరాని పత్తి చేలను చెడగొట్టి మొక్కజొన్న సాగుచేసిన రైతులకు అడియాశలే మిగిలాయి. అనంతరం నెలకు పైగా 3 ఎల్ కెనాల్ ద్వారా నీళ్లు రాకపోవడంతో రైతులు ఆవేదన వెలిబుచ్చారు. ఈ సారైనా మొక్కజొన్న పండిస్తే రైతు దిగుబడి బాగా వస్తుందని అనుకునేలోపు, నీరు సరిగ్గా అందక మొక్కజొన్న పంట వాడిపోతున్నదని వాపోతున్నారు. ప్రస్తుతం సాగునీరు అందకపోవడంతో ఎండిన పంటచేలు మూగజీవాల మేతకు వదిలేస్తున్నారు. కానీ, ప్రభుత్వం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుకాని పరిస్థితి నెలకొంది. మరో నెలైతే పంట చేతికి వచ్చే కాలం. పొట్టదశకు వచ్చిన మొక్కజొన్న, వరిని కాపాడుకోలేక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి సాగునీరు అందించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్య తీర్చాలి

13 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంట సాగు చేశాను. మొదట కాలువలో సాగునీరు ఆశలు చిగురించాయి. ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని చేస్తున్నాను. ఏప్రిల్ వరకు రావాల్సిన 3 ఎల్ కెనాల్ నీరు పూర్తిగా బందయ్యాయి. ఉన్న రెండు బోర్లలో, బావిలో భూగర్భ జలాలు అడుగంటి చుక్కనీరు లేదు. మాపై దయుంచి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి 3 ఎల్, 4 ఎల్ కెనాల్‌లో సాగునీరు అందించి మిగిలిన పంటనైనా కాపాడుకునే విధంగా సహకరించాలని కోరుతున్నాం.

రక్తదానం చేసి ప్రాణం కాపాడుదాం

డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రక్తదానం చేస్తున్న డివైఎఫ్ఐ నేతలు

యువత, విద్యార్థులు రక్తదానం చేసి అభాగ్యుల ప్రాణం కాపాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ఉరితాడును ముద్దాడిన యువకిశోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని తెలిపారు. కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం అందరికీ అందాలని పోరాటం చేశారన్నారు. వారి స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. విద్యారంగాన్ని కాషాయీకరించాలనే కుట్రలో భాగంగానే నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ.. ఉన్న ఉద్యోగాలను కూడా తీసుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాజంలో డ్రగ్స్, గంజాయి యువతను పట్టి పీడిస్తున్నాయని, వాటిని నిర్మూలించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. బెట్టింగ్ యాప్స్ వల్ల అనేక మంది యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, బెట్టింగ్ యాప్స్‌ను ప్రభుత్వం బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు పి.జగన్, బి.శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య, మస్కు చరణ్, చెన్నమోని రాఘవేందర్, నాయకులు బోడా వంశీ మద్దెల, శ్రీకాంత్, విప్లవకుమార్, వినయ్, గణేష్, యాదగిరి, భగత్ పాల్గొన్నారు.

ఎన్‌పిడిసిఎల్‌లో రెవెన్యూ లోటు తీర్చేదెలా..?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌పీడీసీఎల్) 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.10,393 కోట్ల రెవెన్యూ లోటుందని అంచనా వేశారు. ఈ రెవెన్యూ లోటును ఎలాంటి ప్రత్యామ్నాయాలతో భర్తీ చేస్తారనే విషయం మాత్రం టీఎస్ఈఆర్సీ చేపట్టిన బహిరంగ విచారణలో ప్రస్తావించలేదు. టారిఫ్‌లో ఎలాంటి పెంపుదల లేకుండా ఇంత భారీ లోటును పూడ్చుకోవడానికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడంలో ఎన్‌పీడీసీఎల్ విఫలమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలుకే రూ.14,042కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. సరఫరా ఖర్చులే రూ.613 కోట్లు. రూ.19,814 కోట్ల సమగ్ర ఆదాయం ఆవశ్యకతగా అంచనా వేశారు. నష్టాలను తగ్గించుకోవడానికి తీసుకుంటున్న చర్యలను సైతం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వివరించారు. ఈ నష్టాలను తగ్గించడం వల్ల ఎంత ఆదాయం సమకూరుతుందనే విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు.

టెన్త్ పరీక్ష పేపర్ లీక్‌పై ఉన్నతాధికారుల సీరియస్

- పరీక్షా విధుల నుంచి సిఎస్, డిఒ తొలగింపు
- ఇన్విజిలేటర్ సస్పెన్షన్.. విద్యార్థినిడిబార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన పదో తరగతి తెలుగు పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఈ లీకేజీకి సంబంధించి నకిరేకల్ మండల విద్యాధికారి ఎం.నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో భాగంగా శనివారం పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డిని పరీక్షా కేంద్రం విధుల నుంచి తొలగించారు. ఇన్విజిలేటర్ సుధారాణిని సస్పెండ్ చేశారు. పరీక్షా కేంద్రం నుంచి ప్రశ్నాపత్రం లీకేజీకి సహకరించిన విద్యార్థినిని డిబార్ చేశారు. లీకేజీ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారన్న విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది. దీనికి సంబంధించి సుమారు 12 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

అసలేం జరిగిందంటే..

పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 8వ నెంబర్ పరీక్ష గది వద్ద ప్రహరీ గోడ దూకి ఓ వ్యక్తి కిటికీ వద్దకు వచ్చాడు. పరీక్ష రాస్తున్న విద్యార్థిని వద్ద పరీక్ష పత్రం మూడు పేజీలను సెల్ ఫోన్‌లో ఫొటో తీసి శాలిగౌరారం మండల సామాజిక మాధ్యమాలలో విడుదల చేశారు. ప్రశ్నలకు జవాబు చీటీ కాపీలను సిద్ధం చేసి లోపలికి పంపించేందుకు ప్రయత్నం చేయగా.. కొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో లీకేజీ వ్యవహారం బయటపడినట్టు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు మొదటగా శాలిగౌరారంలోనే ప్రశ్నాపత్రం లీకేజీ అయిందన్న తరహాలో దర్యాప్తు చేపట్టారు. కానీ అక్కడ ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఏమీ లేదని చెప్పారు. కానీ, నకిరేకల్ పట్టణంలోని గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నాపత్రం లీకేజ్ అయిందన్న విషయాన్ని గుర్తించి రహస్యంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో సీఎస్, డీఓలను పరీక్ష విధుల నుంచి తొలగించగా, ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థినిని డిబార్ చేశారు. ఇంకా బాధ్యులైన వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్తులో కెఎల్‌ఎం ఆక్సివా పబ్లిక్ ఇష్యూ

- సిఇఒ మనోజ్ రవి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే కాలంలో తమ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తీసుకువచ్చే యోచనలో ఉన్నామని కెఎల్‌ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ సిఇఒ మనోజ్ రవి తెలిపారు. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం ప్రణాళికలు వేసుకుంటున్నామన్నారు. కెఎల్‌ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ హైదరాబాద్‌లో రజతోత్సవ వేడుకలను నిర్వహించింది. రూ.2 వేల కోట్లకు పైగా విలువ కలిగిన ఈ ఎన్‌బిఎఫ్‌సి శనివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఫార్చునా ఉద్యోగులతో 25వ సదస్సు వేడుకలను జరుపుకుంది. దేశంలో తమ సంస్థకు 1000 కి పైగా శాఖలు ఉన్నాయని మనోజ్ రవి తెలిపారు.

చిట్యాల మండలంలో బర్డ్ ఫ్లూ

- రెండు లక్షల కోళ్లను చంపి పూడ్చిపెట్టిన అధికారులు

హైదరాబాద్ బ్యూరో : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోని కోళ్ల ఫామ్‌లో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. కోళ్లకు పరీక్షలు చేయగా బర్డ్ ఫ్లూ వచ్చినట్టుగా నిర్ధారణ అయిందని జెడి రమేశ్ తెలిపారు. రోజువారి పరీక్షల్లో భాగంగా మూడ్రోజుల కిందట ఫామ్‌లో కోళ్ల శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించారు. అక్కడ బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా వచ్చిందని తెలిపారు. శనివారం ఉదయం కోళ్ల ఫామ్‌లో వెటర్నరీ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి పరిశీలించి సుమారు రెండు లక్షల కోళ్లను చంపినట్టు చెప్పారు. వాటిని నాలుగు అడుగుల లోతు గుంత తీసి జేసీబీ సహాయంతో కోళ్లను పూడ్చేశారన్నారు. బర్డ్ ఫ్లూ ఉన్న కోళ్ల ఫామ్‌కు 10 కిలోమీటర్ల పరిధిని రెడ్ జోన్‌గా పరిగణిస్తున్నామని, ఆ ప్రాంతాన్ని మూడు జోన్‌లుగా విభజించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అక్కడి ప్రాంత ప్రజలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ఒక జోన్, 6 కిలోమీటర్ల పరిధిలో రెండో జోన్, 10 కిలోమీటర్ల పరిధిలో మూడో జోన్‌గా పరిగణించి ఆ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడూ పరీక్షలు చేస్తూ బర్డ్ ఫ్లూను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో

O.S. No. 26/2024

Between:

ముషిణి కృపావతి -వాది

Vs

కడలి లక్ష్మి, W/o. సత్యనారాయణ, వయస్సు 50 సం॥లు, గృహిణి, డో.నెం. 8-13-95/13, ఎక్టి కాలనీ, రాఘవేంద్ర నగర్, కుద్బుల్లాపూర్ (మం), మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణా రాష్ట్రం. -ప్రతివాది

యిందుమూలంగా తెలియజేయునది ఏమనగా, పై వాది మీపై పై కోర్టులో దావా దాఖలు చేసియున్నందున, మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపియున్ననూ మీరు తీసుకొని యుండలేదు. కావున **దివి. 21-4-2025 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లు** లగాయితు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల శ్రీ కోర్టు వారికి తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజయేడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

శ్రీ కుడుపూడి శ్రీనివాస్
అడ్వకేట్, అమలాపురం
సెల్: 9493139229

కుత్బుల్లాపూర్
ది. 22-3-2025

వెస్పా 2025 స్కూటర్ల ప్రదర్శన

హైదరాబాద్ : ప్రముఖ ప్రీమియం స్కూటర్ల తయారీ కంపెనీ పియాజియో తన వెస్పా లగ్జరీ స్కూటర్లు, 2025 వెస్పా పోర్ట్‌ఫోలియోను హైదరాబాద్‌లో ప్రదర్శించింది. తన వెస్పా, అప్రిలియాలను అధీకృత మోటోప్లెక్స్ డీలర్ వద్ద పలు మోడళ్లను అందుబాటులో ఉంచింది. 2025 వెస్పా పోర్ట్‌ఫోలియో సరికొత్త సాంకేతికతను కలిగి ఉందని పియాజియో వెహికల్స్ 2డబ్ల్యూ డొమెస్టిక్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ రఘువంశీ పేర్కొన్నారు. కొత్త వెస్పా ఎప్పటిలాగే ప్రత్యేకంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

బ్రెయిట్లింగ్ 140వ వార్షికోత్సవ ఎగ్జిబిషన్

హైదరాబాద్ : నగరంలోని కమల్ వాచ్ కంపెనీ వద్ద బ్రెయిట్లింగ్ తన 140వ వార్షికోత్సవ వింటేజ్ వాచ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను బ్రెయిట్లింగ్ బోటిక్ వద్ద మార్చి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. 1884లో కార్యకలాపాలు ప్రారంభించిన బ్రెయిట్లింగ్ 140 ఏళ్లుగా వాచ్ తయారీ ఆవిష్కరణలలో ఉంది. తమ ఎగ్జిబిషన్‌లో విప్లవాత్మక గడియారాలను చూసే అవకాశాన్ని కల్పిస్తున్నామని బ్రెయిట్లింగ్ సిఇఒ జార్జెస్ కెర్న్ పేర్కొన్నారు.

దక్షిణాది నుంచే సగం అమ్మకాలు

- జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ వెల్లడి

న్యూఢిల్లీ : తమ మొత్తం అమ్మకాల్లో దక్షిణాది రాష్ట్రాలే సగం వాటాను కలిగి ఉన్నాయని జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ తెలిపింది. గతేడాది 2024లో దేశంలో 22,646 విద్యుత్ కార్లను విక్రయించగా.. అందులో 10,698 యూనిట్లు లేదా 47.2 శాతం దక్షిణాదిలోనే అమ్ముడుపోయాయని పేర్కొంది. తమ ఇవి కొనుగోళ్లలో కర్నాటక టాప్‌లో ఉండగా.. తెలంగాణ, కేరళ రాష్ట్రాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయని వెల్లడించింది.

ఎస్‌ఎల్‌బిసి సహాయక చర్యలకు రూ. ఐదు కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎల్‌బిసి సొరంగ ప్రమాద సహాయక చర్యల కోసం రూ. ఐదు కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ జిఒ నంబరు 11ను విడుదల చేశారు. ఈ మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు నిధులను విత్‌డ్రా చేసి ఖర్చుపెట్టే అధికారాన్ని కల్పించారు.

రాష్ట్ర వ్యాప్తంగా దావత్ ఎ ఇఫ్తార్

- డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా దావత్ ఎ ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీలో ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదని తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీపడాల్సిన అవసరంలేదని చెప్పారు. ఇఫ్తార్ ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదన్నారు. చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. లా అండ్ ఆర్డర్, విద్యుత్, మంచినీరు వాటి అంశాలు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. ఏర్పాట్లలో ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనా అధికారులు మొహమాట పడకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి చేయాలి

- బిజెపి ఎంపీ ఏమి చేస్తున్నారు?
- నిధుల కోసం కేంద్రంపై సిఎం రేవంత్ ఒత్తిడి తేవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాదయాత్ర చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్‌లోని ఉప్పల్-నారపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ అధ్వర్యంలో శనివారం చెంగిచర్ల చౌరస్తా నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఫ్లైఓవర్ పనులు 2018 జులైలో ప్రారంభించారని, 2020 జులై నాటికి పూర్తి కావాలని, కానీ ఏడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ 40 శాతం పనులే పూర్తయ్యాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తికాక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పనులు పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయాణం సమస్యాత్మకం..

హైదరాబాద్- వరంగల్ మధ్య వాహనాల రద్దీ బాగా పెరిగి ఉప్పల్ సమీపంలో ట్రాఫిక్ సమస్య పెరిగిందని జాన్‌వెస్లీ తెలిపారు. దాంతో దిగువన 150 మీటర్ల సర్వీసు రోడ్డు నిర్మిస్తూ, ఘట్కేసర్ వైపు వెళ్లే వాహనాల ప్రయాణానికి ఆటంకం లేకుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని 2017లో ప్రతిపాదించారని గుర్తు చేశారు. ఉప్పల్ చౌరస్తా నుంచి నారపల్లి (మేడిపల్లి) వరకు 6.2 కి.మీ. నిడివిలో 45 మీటర్ల వెడల్పు ఉండే ఆరు లైన్ల ఫ్లైఓవర్‌కు డిజైన్ చేశారని, పివి నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత ఇదే పెద్ద ఫ్లైఓవర్ అని తెలిపారు. రూ.670 కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ ఫ్లైఓవర్‌ను నిర్మాణ సంస్థ ఏకంగా 25 శాతం తక్కువకు టెండర్‌కు దక్కించుకుందన్నారు. కానీ, 43 శాతం మాత్రమే పనులు చేసి ఆపేసిందని తెలిపారు. జాతీయ రహదారులు, ఎలివేటెడ్ కారిడార్స్ నిర్మాణం, ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. మరి కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని ఎంపి ఈటల రాజేందర్ (బిజెపి) అయినప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి 8 మంది బిజెపి ఎంపిలు ఉన్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఈ అలసత్వానికి కారణం నిర్మాణ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అని కేంద్రం వారిపై పెనాల్టీ వేస్తున్నట్టుగా ప్రకటించడం తన బాధ్యతారాహిత్యాన్ని కప్పి పుచ్చుకోవడమేనన్నారు.

గత ఆగస్టులో చేసిన ప్రకటన ఏమైంది..?

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. గతంలో మల్కాజిగిరి ఎంపిగా ఉన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు సిఎంగా ఉన్నారని.. ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రయాణికుల అవస్థలను తొలగించేందుకు ఫ్లైఓవర్ పనులు సత్వరం పూర్తయ్యేలా చూడాలని కోరారు. 2024 ఆగస్టులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపి ఈటల రాజేందర్‌తో కలిసి ఇక్కడ పర్యటించినప్పుడు 10 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని, 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ అతిగతీ లేదన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ సంస్థపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, కోమటి రవి, ఎం.వినోద, ఎర్ర అశోక్, జి.శ్రీనివాసులు, రాజశేఖర్, నాయకులు వెంకన్న, రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, సబితా, లక్ష్మణ్, చింతల యాదయ్య, శ్రీమన్నారాయణ, సృజన, శారద, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్డు ఉంటే ఆత్మీయ భరోసా వర్తించదు

- అసెంబ్లీలో మంత్రి సీతక్క స్పష్టీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధి హామీ కార్డు ఉన్న అందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించబోదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) స్పష్టం చేశారు. రైతు భరోసా వచ్చిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం లేదని చెప్పారు. శనివారం అసెంబ్లీలో వ్యవసాయం, అనుబంధ రంగాల పద్దులపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల రైతు భరోసా నిధులు ఇప్పటి వరకు రూ.60 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఈ నెల 31లోపు రెండో విడత నిధులను విడుదల చేస్తామన్నారు.

ఎకరాలోపు ఉన్న రైతులకు
ఆత్మీయ భరోసా ఇవ్వాలి : హరీశ్‌రావు

ఎకరాలోపు భూమి ఉన్న రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని బిఆర్‌ఎస్ సభ్యులు టి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. పది గుంటల భూమి ఉన్న వారికి రైతు భరోసా కింద ఏడాదికి రూ.మూడు వేల పెట్టుబడి సాయం అందుతుందని వివరించారు. అదే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు వస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఆలోచించి పేద రైతులకు ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు న్యాయం చేయాలని కోరారు. ఇంకోవైపు రాష్ట్రంలో 1.02 కోట్ల మందికి ఉపాధి హామీ కార్డులున్నాయని వివరించారు. వారికి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలంటే రూ.12 వేల కోట్లు అవసరమవుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.930 కోట్లు కేటాయించిందని వివరించారు. 2025-26 బడ్జెట్‌లో కేవలం రూ.600 కోట్లు కేటాయించిందని చెప్పారు. అంటే రూ.330 కోట్ల నిధులకు కోత విధించిందని విమర్శించారు. అందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలంటే ఇంత తక్కువ నిధులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. దీనిపై మంత్రి సీతక్క స్పందించారు. ఉపాధి హామీ కార్డులున్న అందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వర్తించబోమని స్పష్టం చేశారు. ఇంకోవైపు ఎకరాలోపు భూమి ఉన్న రైతులకు వర్తింపజేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

ఎప్‌సెట్‌కు 1.75 లక్షల దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 1,75,991 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 1,27,758 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 48,115 మంది రెండింటికీ 118 మంది కలిపి మొత్తం 1,75,991 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుము లేకుండా వచ్చే నెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుముతో అదే నెల 24వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నేతలు

రాష్ట్రంలో నిర్వహించబోతున్న ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ ట్రస్ట్ భవన్‌లో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ పెట్టుబడిదారుల మార్కెట్ ప్రయోజనాల కోసం మహిళల అందాల పోటీలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ఎంతో మంది మహిళలు అన్నం లేక, రక్తహీనతతో బాధపడుతున్నారనే విషయాన్ని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తుంటే.. ఆ స్థితిని అధిగమించేందుకు తగిన విధాన నిర్ణయాలు తీసుకునే చిత్తశుద్ధి పాలకులకు లేదని చెప్పారు. సరైన ఉపాధి దొరకక, పని ప్రదేశాల్లో వేధింపులు, లైంగిక దాడులు జరుగుతుంటే.. వాటిని అరికట్టలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాదం ముసుగులో మహిళలను రెండో తరగతి పౌరులుగానే, వంటింటికే పరిమితం చేయాలనే విధానాలను వేగంగా అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడబలుక్కొని తెలంగాణ వేదికగా ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించటం సిగ్గుచేటని విమర్శించారు. మే 7న ప్రారంభించనున్న ఈ పోటీలను అదే నెల 31న గ్రాండ్ ఫినాలేతో ముగించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, మహిళలపై హింస పెరుగుతున్నది, ఈ క్రమంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకులు అంతర్జాతీయ వేడుకలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళలు అనేక రంగాల్లో ముందుకు పోతూ విజయాలు సాధిస్తుంటే వారి వ్యక్తిత్వం, గౌరవం, ఔన్నత్యాన్ని పెంచే విధంగా విధి విధానాలు రూపొందించాలి గానీ.. వారి వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా సినిమాల్లో అశ్లీలతను విచ్చలవిడిగా పెంచేందుకు అనుమతులు కల్పిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.ఎన్. ఆశలత, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో 10,954 పోస్టులు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందిప్‌కుమార్ సుల్తానియా శనివారం జిఒ నెంబర్ 41ని జారీ చేశారు. నూతన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు (జీపీఒ)గా ప్రభుత్వం నామకరణ చేసింది. మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్‌ఏల నుంచి ఆప్షన్లు తీసుకుని వీటి నియామకాలు చేపట్టనున్నారు. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇందుకు సంబంధించి సర్కార్ తీసుకున్న నిర్ణయం మేరకు శనింవారం పోస్టులను ఆర్థిక శాఖ మంజూరు చేసింది.

ప్రభుత్వానికి రెవెన్యూ జెఎసి కృతజ్ఞతలు

రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ రెవెన్యూ జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ధన్యావాదాలు తెలిపారు. తాము గతంలో పలుమార్లు చేసిన వినతి మేరకు సర్కార్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ పట్టాలెక్కితే క్షేత్రస్థాయిలో ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

కోమటిరెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

- స్పీకర్‌కు అందజేసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై వారు సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ చాంబర్‌లో కలిసి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సమాధానమిస్తూ.. బిఆర్‌ఎస్ పాలనలో సిఆర్‌ఎస్ నిధులు రాలేదని, నల్లగొండ నియోజకవర్గ రోడ్లకు నిధులు కేటాయించలేదనీ, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఎస్క్రో అకౌంట్ తెరవలేదని చెప్పడం ద్వారా సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారని తెలిపారు. ఈ సందర్భంగా అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలనలో సిఆర్‌ఎఫ్ నిధులు వచ్చాయనీ, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ఎస్క్రో అకౌంట్ తెరిచామని గుర్తు చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో రోడ్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు. ఈ మూడు అంశాలకు సంబంధించిన ఆధారాలు లేఖ ద్వారా స్పీకర్‌కు ఇచ్చామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి ఉద్దేశపూర్వకంగా ఇచ్చిన సమాధానం పూర్తిగా అవాస్తవమనీ, ఉద్దేశపూర్వకంగా సభకు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సభా గౌరవాన్ని తగ్గించడమే కాక సభ్యుల హక్కులకు భంగం కలిగించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

హ్యామ్ పద్ధతిలో రోడ్ల నిర్మాణం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన సమాధానాలకు ఏం మాట్లాడాలో అర్థంకాక సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోతున్నారని బిఆర్‌ఎస్ సభ్యులనుద్దేశించి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చురకలు అంటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్‌ఎస్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో ప్రశాంత్‌రెడ్డి, కోమటిరెడ్డి మధ్య వాదోపవాదాలు నడిచాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. 'ప్రయివేటు భాగస్వామ్యంతో రోడ్లు వేయడానికి ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలున్నాయా? ఉంటే వివరాలేంటి.. విధివిధానాలేంటి? ప్రయివేటురంగం, బ్యాంకులు భరించే వ్యయం దామాషా ఎంత? రోడ్ల కోసం తీసుకునే లోన్లు ఎఫ్‌ఆర్‌బిఎమ్ పరిధిలోకి వస్తాయా?' అంటూ హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. దానికి సమాధానమిస్తూ సభ్యులడిగిన ప్రశ్నలేవీ ఉత్పన్నం కావంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానమిచ్చారు. తాము అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమివ్వడం లేదనీ, దాటవేస్తున్నారని బిఆర్‌ఎస్ సభ్యులిద్దరూ ఎదురుదాడికి దిగారు. దీంతో మళ్లీ కోమటిరెడ్డి మాట్లాడుతూ..వాళ్లు ప్రయివేటు భాగ్యస్వామ్యంతో రోడ్లు వేయబోతున్నారా? అని అడిడితే లేదని చెప్పాననీ, దాంట్లో తప్పేముందని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో పిపిపి విధానంలో రోడ్లు అస్సలే వేయబోమని స్పష్టం చేశారు. హైబ్రిడ్ యాన్యూటీ(హ్యామ్) విధానంలో వేయబోతున్నామని ప్రకటించారు. ఏడు కిలోమీటర్ల ఉప్పల్ ఎలివేటర్ కారిడార్‌ను పదేండ్ల కాలంలో బిఆర్‌ఎస్ పూర్తిచేయలేకపోయిందని విమర్శించారు. తమ ప్రభుత్వం 18 నెలల్లో దాన్ని పూర్తిచేయబోతున్నదని ప్రకటించారు.

మహిళా వికలాంగుల సాధికారతకు ప్రత్యేక పథకం

- ఎన్‌పిఆర్‌డి సదస్సులో వక్తల డిమాండ్
- హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా వికలాంగుల సాధికారత, స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'మహిళా వికలాంగుల సాధికారత-సంక్షేమం' అనే అంశంపై సి.సాయమ్మ అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. మహిళా వికలాంగుల సాధికారత, సంక్షేమంపై తీర్మాణాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి.వరమ్మ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి మాట్లాడుతూ.. మహిళలు, మహిళా వికలాంగులపై వేధింపులు, లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు రాజ్యాంగంలో ఉన్న అంశాలు అమలు కావడం లేదన్నారు. వైకల్యం ఉన్న పురుషులతో పోలిస్తే వైకల్యం ఉన్న మహిళల జీవితాలు మరింత దుర్భరంగా ఉన్నాయని చెప్పారు. జీవన నాణ్యత ఇప్పటికీ తక్కువగా ఉందని చెప్పారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది మహిళా వికలాంగులున్నారని తెలిపారు. మహిళా వికలాంగుల్లో వివాహం కాని వారి సంఖ్య సాధారణ మహిళలతో పోల్చితే నాలుగు రెట్లు అధికంగా ఉందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. వికలాంగ మహిళల హక్కులు, రక్షణ కోసం ఎన్‌పీఆర్‌డీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. మహిళా మానసిక వికలాంగులు 70 శాతం లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా వికలాంగులపై వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, వారిని వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం అమల్లో భాగంగా కోటి మంది మహిళలకు అందిస్తున్న పథకాల్లో 5శాతం మహిళా వికలాంగులకు కేటాయించాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుద్యోగ మహిళా వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ పి.ఉమర్ ఖాన్, వీఆర్‌సీ మాజీ డైరెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె సలీమ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణ జ్యోతి మాట్లాడుతూ.. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో నిర్ణయాలు చేసే స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జె.రాజు, బి.స్వామి, నాగలక్ష్మి, యశోద, గంగాధర్, కాషాప్ప, దశరథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు శశికళ, సావిత్రి, ప్రకాష్, భుజంగారెడ్డి, చంద్రమోహన్, జయలక్ష్మి, రమేష్, సంతోష, బాలయ్య, నరసింహ,షాహీన్ బేగం,నగేష్,కవిత, భాగ్యలక్ష్మి, మంగమ్మ, ఉషా పాల్గొన్నారు.

ట్రయల్ రన్‌కు మరో రెండు రోజులు?

- ఆస్ట్రియా ఇంజనీరు కోసం ఎదురు చూపులు
- దేవన్నపేట పంప్‌హౌజ్‌కు మళ్లీ రానున్న మంత్రులు
- వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు..?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేవాదుల ప్రాజెక్టు 3వ దశలోని మూడో ప్యాకేజీ కింద హనుమకొండ జిల్లా హసనపర్తి మండలంలోని దేవన్నపేట పంప్‌హౌజ్‌లో ఒక్క మోటార్‌ను రన్ చేసి 50 వేల ఎకరాలకు సాగునీరందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ నెల 18న నీటిపారుదల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దేవన్నపేట పంప్‌హౌజ్‌కు మోటార్ స్విచ్చాన్ చేయడానికి వచ్చినా పనులు పూర్తి కాకపోవడంతో అర్ధరాత్రి వరకు వేచి చూశారు. వారం రోజులుగా ప్రాజెక్టుల మోటార్లకు సంబంధించిన సలహాదారులు కె.పెంటారెడ్డి ప్రాజెక్టు వద్దనే మకాం వేసి మోటార్ల బిగింపు, ట్రయల్‌రన్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టు అధికారులు సైతం ఇక్కడే మకాం వేశారు. కాగా, ఆస్ట్రియాలోని 'ఆంద్రిట్జ్' కంపెనీకి చెందిన మోటార్లను దేవన్నపేట పంప్‌హౌజ్‌లో వినియోగిస్తుండటంతో ఆ కంపెనీ ఇంజినీర్ల సమక్షంలోనే వాటిని రన్ చేయాల్సి ఉంది. దేవన్నపేట పంప్‌హౌజ్‌లో ఒక్క మోటార్‌నైనా రన్ చేస్తే ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపడానికి అవకాశముంటుంది. తద్వారా వరంగల్ నగరంతోపాటు పలు గ్రామాలకు తాగునీరు, పంటలకు సాగునీరందనుంది. రబీలో సాగుచేసిన వరి పొట్ట దశలో ఉండటంతో చివరిదశలో నీరందించాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉంది. దాంతో రాత్రిపగళ్లు దేవన్నపేట పంప్‌హౌజ్‌లో నిరంతరం పనులు జరుగుతున్నాయి. దేవన్నపేటలో ఒక్క మోటర్‌ను విజయవంతంగా రన్ చేసినా 40 నిమిషాల్లో ఇక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుతాయి. రామప్పలో ప్రస్తుతం 1 టీఎంసీల నీరుంది. ధర్మసాగర్ రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడం ద్వారా మార్చి 31 తర్వాత గ్రేటర్ వరంగల్‌కు తాగునీటి సమస్య రాకుండా ఉంటుందని అధికారులు ట్రయల్ రన్ కోసం తీవ్రంగా పని చేస్తున్నారు.

2008లో రూ.1,410 కోట్లతో పనులు ప్రారంభం

మూడో ప్యాకేజీ పనులను 2008లో రూ.1,410 కోట్లతో ప్రారంభించారు. మూడో దశలో సలివాగులో టన్నెల్ పనుల్లో ప్రమాదం ఏర్పడి కార్మికులు మృతి చెందడంతో 2016 వరకు నిలిచిపోయాయి. సుమారు తొమ్మిదేండ్ల విరామం తరువాత మళ్లీ 2017లో పనులు ప్రారంభమయ్యాయి. దేవన్నపేటలో 144.5 మీటర్ల అత్యంత లోతైన పంప్‌హౌజ్‌ను నిర్మించారు. ఈ ప్యాకేజీలో రామప్ప నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ వరకు 49.06 కిలోమీటర్ల మేరకు టన్నెల్‌లో గోదావరి జలాలను తరలిస్తున్నారు. దేవన్నపేట పంప్‌హౌజ్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ వరకు 6.86 కిలోమీటర్లు ఉంటుంది. దేవన్నపేట పంప్‌హౌజ్‌లో 3 మోటర్లను అమర్చారు. ఈ పంప్‌హౌజ్‌ను ప్రారంభిస్తే ఒక్కో మోటర్‌తో 16.56 క్యూమెక్స్ అంటే మొత్తం 49.68 క్యూమెక్స్ (1,750 క్యూసెక్కులు) గోదావరి జలాలను తరలించి వేగంగా ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపడానికి అవకాశముంది. రామప్ప సరస్సు సముద్రమట్టానికి 209.38 మీటర్ల ఎత్తులో ఉంది. ధర్మసాగర్ రిజర్వాయర్ 309.5 మీటర్ల ఎత్తులో ఉంది. దేవాదుల మూడో దశలో మూడో ప్యాకేజీ కింద రామప్ప నుంచి దేవన్నపేట వరకు గ్రావిటీ ద్వారా గోదావరి జలాలు రానున్నాయి. దేవన్నపేట నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలతో గోదావరి జలాలను తరలిస్తారు. దేవన్నపేటలో మూడు మోటార్లతో ట్రయల్ రన్ సక్సెస్ అయితే వచ్చే వానాకాలం జనగామ జిల్లాతోపాటు యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు సాగునీరందుతుంది. ఒక్క మోటర్‌ను రన్ చేయడానికి 'ఆంద్రిట్జ్' కంపెనీకి చెందిన కీలక ఇంజినీర్ ఇక్కడకు రావడానికి వీసా కోసం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. శనివారం లేదా ఆదివారం వరకు దేవన్నపేటకు చేరుకునే అవకాశముంది. ట్రయల్ రన్ విజయవంతమైతే రెండ్రోజుల్లో మళ్లీ మంత్రులు దేవన్నపేటకు వచ్చి మోటర్‌ను స్విచాన్ చేసి ధర్మసాగర్ రిజర్వాయర్ కింద 60వేల ఎకరాలకు సాగునీరందించనున్నారని తెలిసింది. కాగా, తొమ్మిదేండ్ల జాప్యంతో అంచనా వ్యయం రూ.270 కోట్లు అదనంగా పెరిగింది.

వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు..?

రబీ సాగు ముగింపు దశకు చేరుకోవడంతో ఇక ఈ పంప్‌హౌజ్‌తో వానాకాలపు సాగుకు సమృద్ధిగా సాగునీరందించే అవకాశముంది. ఈ మూడు మోటర్లతో గోదావరి జలాలను ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేస్తే పది రోజుల్లో 1.50 టీఎంసీల నీటితో ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపవచ్చు. దేవన్నపేటలో మూడు మోటర్ల బిగింపు, ట్రయల్‌రన్ సక్సెస్ అయితే వచ్చే వానాకాలంలో మూడో ప్యాకేజీ కింద భూములు సస్యశ్యామలం కానున్నాయి.

వ్యాపారులను నమ్మించి బంగారం, డాలర్లతో పరార్

- దుండగుని కోసం పోలీసుల గాలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు వ్యాపారులను తన మాయమాటలతో నమ్మించి వారి నుంచి బంగారం, డాలర్లు తీసుకుని ఓ దుండగుడు పరారయ్యాడు. అర కిలో బంగారం, 18 వేల అమెరికన్ (యూఎస్) డాలర్లు ఎత్తుకెళ్లాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులిద్దరూ పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

హైదరాబాద్ నార్సింగి ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ఆన్‌లైన్‌లో గోల్డ్ బిజినెస్ వ్యాపారం చేస్తుంటారు. నల్లగండ్లకు చెందిన రఫీ మనీ ఎక్స్ఛేంజ్ వ్యాపారం చేస్తుంటారు. వారిద్దరికీ స్టీఫెన్ అనే పేరుతో ఓ వ్యక్తి శుక్రవారం ఫోన్ చేశాడు. బంగారం, అమెరికన్ డాలర్లు కొంటానని చెప్పాడు. గచ్చిబౌలి సెంట్రో మాల్‌లో కలుద్దామని వారిని అక్కడికి రప్పించి మాల్ లోపల ఓ రూమ్‌కి తీసుకెళ్లాడు. అనంతరం వారి నుంచి గోల్డ్ బిస్కెట్లు, డాలర్లు తీసుకున్నాడు. వారిద్దరినీ అక్కడే ఉండమని, తాను వెళ్లి ఒక్క నిమిషంలో నగదు తెస్తానని చెప్పాడు. స్టీఫెన్ మాటలు నమ్మిన బాధితులిద్దరూ అక్కడే కూర్చుండిపోయారు. అతను ఎంతకీ రాకపోవడంతో మాల్ మొత్తం వెతికారు. అయినా స్టీఫెన్ జాడ తెలియకపోవడంతో మోసపోయామని గుర్తించిన చంద్రశేఖర్, రఫీ గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి స్టీఫెన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సిసి కెమెరాల పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. బాధిత వ్యాపారుల దగ్గర డాలర్లు ఎక్కడివనే దానిపై కూడా దర్యాప్తు వేగవంతం చేశారు.